
డిశంబరు నెల

# భావపరిచయ పోటీ

బహుమానం రూ. 10-00



ఈ కార్టూనుకు హాస్యయుత వ్యాఖ్య (Caption) కావాలి.

వ్యాఖ్య వచనంగా గానీ, పద్యంగా గానీ వుండవచ్చు. వచనంగా అయితే ఒక్క వాక్యంలోనూ, పద్యంగా అయితే నాలుగు పాదాల లోపుగాను వుండాలి.

వ్యాఖ్య కార్డుపైననే వ్రాసిపంపాలి. కవరులో పంపినవి అంగీకరింపబడవు.

మాకుచేరిన వ్యాఖ్యలలోకెల్లా ఉత్తమంగా వున్నదానికే బహుమానమివ్వబడును. బహుమతి నిర్ణయంలో సంపాదకునిదే తుదినిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు.

వ్యాఖ్యలు మాకు నవంబరు 5వ తేదీలోగా చేరాలి. యువ పాఠకులందరూ ఈపోటీలో పాల్గొనవచ్చును. ప్రవేశరుసుము లేదు.



# ఆమె నవ్వింది

'సుమైత్రాంగి'

అప్పటికి ఆరోజు పనులు ముగిసాయి.

కాస్సేపు గాలి పీల్చుకుంటానికి వీధి వాకిట్లోకొచ్చి నిల్చుంది కమల. అప్పటికే ఆ వీధి నిర్మానుష్యంగా వుంది. ఎదిరింటివాళ్ళుమాత్రం గుమ్మం ముందు, అందంకోసం పెంచుకుంటున్న పూలమొక్కలమధ్య కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు వుల్లాసంగా. ఎవరి రేడియోలోనో, వివిధభారతినుంచి హిందీ పాటలు వినిపిస్తున్నాయి నెమ్మదిగా.

"ఆవిడెంత అదృష్టవంతురాలో!" ఎదిరింటావె నుద్దేశించి ఈర్ష్యగా గొణుక్కుంది కమల.

ఆవిడెప్పుడు చూసినా చీర నలక్కుండా, జుట్టురేక్కుండా కనిపిస్తుంది. పైగా ఎప్పుడూ కూర్చునేవుంటుంది. రోజంతా పనీ గినీ లేకుండా ఇలాకూ ర్చోవడానికి ఆమెకు నడుంనొచ్చదు కాబోలు? పెట్టిపుట్టిన ఇల్లాలు. ఆరొందల జీతగాని భార్య. ఆవిడకునడుం వంచి పని చేయాల్సిన ఖర్మ ఎందుకొస్తుంది? వంటకి మనిషి. పైపనులకు మనిషి. మొక్కల సంరక్షణ చేయడానికి మనిషి. అదృష్టం అంటే ఆమెదేను. అటువంటి అదృష్టం అందరికీ వస్తుందా?" ఇంకా ఎదిరింటామె అదృష్టంగురించే ఆలోచిస్తున్న దికమల.

"అమ్మా! ఇక్కడున్నావా?" అంటూ వచ్చారు పిల్లలు.

"అబ్బబ్బ కాస్సేపన్నా వంటరిగా కూర్చోవడానికి లేదుకదా ఈ పిల్లల్తో. ఎందుకొచ్చిన పిల్లలు? వీళ్లుపుట్టి తన సుఖసౌఖ్యాలను జలగల్లా పీల్చేస్తున్నారు కదా!" వాళ్ళవైపు కోపంగాచూస్తూచిరాకు పడింది కమల. చీకటిమొహాన్నే లేస్తే ఇప్పటికి లభించింది విశ్రాంతి. కాని ఈ కాస్సేపు విశ్రాంతి వాళ్ళరాకతో పోతుంది కదా అని ఆమెబాధ.

"అమ్మకు ఇట్టేవస్తుంది కోపం." ఆఖరిపిల్ల అల్లరిగా నవ్వింది. "మనం లోపలికి పోదాము పదండ్రా." తల్లి కోపాన్ని ఆకళింపుచేసుకున్న పెద్ద పిల్లాడు తిరిగి లోపలకెళ్తూ తతిమ్మా పిల్లల్ని లాక్కుపోయాడుకూడా. ఎలా వచ్చారో అలా వెళ్లారు వాళ్లు. తనకి నలుగురు పిల్లలు. వాళ్ళ చాకిరీలతో, వాళ్లచేసే అల్లరీ ఆగడాలతో సరి పోతుంది రోజంతా. ఇక తీరుబడి ఎక్కడిదీ? అలా అని, వాళ్ళు క్షణం కనిపించకపోయినా కమల విలవిల్లాడిపోతుంది. కంగారుపడ్తుంది." వాళ్లెక్కడికెళ్లారబ్బా. ఎవరితో అన్నా దెబ్బలాట పెట్టుకుని రాతుకదా. కొంపదీసి దేనికిందైనా పడరు కదా?" తన కటువంటి చెడుతలంపులు కలిగినందుకు తనని తను తిట్టుకుంటూ, కలవరపడే హృదయంతో క్షణమొక యుగంలా గడుపుతుంది పిల్లల రాక కోసం నిరీక్షిస్తూ.

పిల్లలుచేసే అల్లరిపన్లకు కోపం ముంచుకొస్తుంది. ఆ కోపంతో వాళ్ళని నాలుగు వాయించినా, అంతలోనే ఆ కోపంతగ్గి మనసు జాలితోనిండిపోతుంది. అప్పుడనుకుంటుంది బాధగా. "వాళ్ళు పసివెధవలు. పిల్లలు అల్లరి చేయకపోతే ఇంకెవరుచేస్తారు, పెద్దవాళ్ళా?" అని. తన ఊహకి తనే నవ్వుకుంటుంది చిన్నగా. ఎదిరింటామె కట్టుకున్నచీర లైటుకాంతిలో తళతళ మెరుస్తున్నది. మళ్లీ కొత్తచీర కొనుక్కుంది కాబోలు? ఆవిడకేంలోటు. పిల్లా జల్లా లేరు . మొగుడి సంపాదనంతా చీరలకు, నగలకు పెట్టకపోతే ఇంకేంచేస్తుంది?

"నీ మొగుడు మామూలు గుమాస్తా. ఆ గుమాస్తా సంపాదనతో నీవు,నీభర్తా, నీ నలుగురు పిల్లలు బ్రతకాలి తెలుసా. ఆ జీతమంతాపెట్టినా అటువంటి చీర కొనలేవు." మనసు నచ్చచెప్పబోయింది. "అవును, నాకు తెలుసు." తను కట్టుకున్న సాదా నేతచీరవైపు చూసుకుని బాధగా నిట్టూర్చింది కమల. కాని మనసులో మరోబాధ దానినేమరికొందరు ఈర్ష్య అంటారు. అటువంటిది అప్పుడప్పుడూ ఆమెలో తలెత్తి మతిపోయేలా చేస్తుంటుంది. ఎదిరింటామె అనుభవించే జీవితాన్ని చూస్తుంటే, తనకూ అలా ఆర్జించి సుఖపెట్టే భర్త లేడనే బాధ. సంపద ఎంతవుంటేనేం వాళ్ళకి పిల్లా పీచా. పిల్లలులేని యిల్లూ ఓ యిల్లేనా? నాకు చూడు. నలుగురు పిల్లలు, అనే అహంకారంతో కూడిన సంతృప్తి. ఇదీ కమల అంతరంగం.

ఇంక లోపలికి పోదామా అనుకునేంతలో ఎదిరింటామె చెయ్యివిసిరింది రమ్మన్నట్లుగా. ఆవిడ పిలుస్తుంటే, దులపరించుకుని వెళ్ళడం బాగోదని, అయిష్టంగానే అటు కదిలింది కమల.

ఆమెను సాదరంగా ఆహ్వానిస్తూ "కూర్చో! భోజనాలయ్యాయా?'' అడిగిందామె. ఆమె పేరు రుక్మిణి.

"ఆ, ఇప్పుడే. అన్ని పనులు తెముల్చుకుని ఇవతలపడ్డాను. పిల్లలున్న యింట్లో ఎప్పుడూ ఏదో ఒకపని వుంటూనే వుంటుంది." చూసారా, నాకు పిల్లలున్నారు అనేభావాన్ని మాటల్లో వ్యక్తంచేసి గర్వంగా నవ్వింది కమల.

"ఎలా అన్నా పిల్లలున్న ఇంటిదారే వేరు. మా యిల్లు చూసారా ఎంత నిశ్శబ్దంగా వున్నదో"— రుక్మిణిగొంతులో నాకు పిల్లలులేరు అనే బాధ వ్యక్తమయ్యింది.

అవును. ఆ మాటా నిజంవే, అనుకుంది కమల. తన పిల్లలుచేసే అల్లరి తల్చుకుంటూ.

"ఈ మాట విన్నారా? శంకర్రావు భార్యకి ప్రెగ్నెన్సీట. ఈ సంగతి డాక్టరు చెప్పినప్పట్నుంచి శంకర్రావు ఆనందానికి అవధుల్లేవనుకో. పాపం, పిల్లల కోసం తపించిపోయాడతను.ఇప్పటికతన్ని కోర్కెతీరింది." రుక్మిణి భర్త మాధవరావుగారన్నారు. ఉత్సాహంగా భర్త చూపించే ఉత్సాహాన్ని భరించలేని రుక్మిణివదనం క్షణంలో ముడుచుకుంది. వడిలిపోయిన తామరపూవు జ్ఞాపకం వచ్చింది కమలకు ఆమెను చూస్తుంటే.

పెళ్ళయిన పదిహేనేళ్ళకు శంకర్రావు భార్య తల్లికాబోతున్నది కాని మనకా అదృష్టంకూడా లేదుగా అని భర్త మనసులో బాధపడుతున్నాడు కాబోలు. అనుకున్న రుక్మిణి గబుక్కున ప్రసంగ ధోరణి మారుస్తూ 'ఈ నెక్లెస్ చూసావా కమలా? ఈ మధ్యే చేయించుకున్నాను' అందామె. మెడలో నెక్లెస్ సవరించుకుంటూ. లైటుకాంతికి కొత్తనగ మిలమిల మెరిసింది.

ఎన్ని నగలన్నా చేయించుకోగలరు. మీకు లోటేంవిటి అని మనసులో అనుకున్నా. పైకి నవ్వేస్తూ "చాలా బాగుంది ఒదినగారూ'' అంది కమల.

గుమ్మంలోకొచ్చి "అమ్మా! నాన్నగారు పిలుస్తున్నారు" అని అరిచాడు పెద్దపిల్లాడు. "వస్తానండి, మా వానర సైన్యం వచ్చిందంటే మీ ఇల్లు పీకి పందిరేస్తారు" అంటూ వెళ్ళిపోయింది కమల. తన ఇంట్లోకి.

ఆ రాత్రి ఎంత సేపటికీ నిద్రపట్టలేదామెకు. కన్నుమూసినా, తెరచినా రుక్మిణి కట్టుకున్న సిల్కుచీర, మెడలో అలంకరించుకున్న కొత్తరకం నెక్లెసే కనిపిస్తున్నాయి వూరిస్తూ. తనూ అటు

వంటి నెక్లెసు చేయించుకుంటే? అయ్యో రాత. ఎంత పొదుపుగా, క్లుప్తంగా వాడుకున్నా భర్త జీతం నెలంతా చాలదు. ఇంకా నా నగలకు, చీరలకుకూడా మిగుల్తుందా? ఆ యోగమే వుంటే? ఊఁ వుంటే, మనసులో ఎవరి మొహమో మెదిలింది లీలగా. తనని మొట్టమొదటగా చూట్టానికొచ్చాడతను. చేసే వుద్యోగం చాలా మంచిది. పైగా ముందు ముందు, జీతం పెరుగుతుంది కూడా అని తండ్రితో చెప్పాడు మధ్యవర్తి. అన్నివిధాల ఆ సంబంధం మంచిదని, తన తండ్రికూడా మోజు పడ్డాడు, తననిచేయడానికి. కాని తల్లే పడనిచ్చిందికాదు. "వాళ్ళ వంశచరిత్ర మంచిదికాదు. వాళ్ల పుట్టుపూర్వోత్రాలన్నీ నాకు తెలుసు. ఆ అబ్బాయి తాత ముత్తాతలందరూ వేశ్యాలోలురై ఆస్థిని తగలేసారు. ఈ అబ్బాయి తండ్రికూడా స్త్రీలోలుడు. భార్యా పిల్లలు వుండగానే మరో ఆడదాన్ని పెట్టుకున్నాడట. అటువంటి తండ్రి కొడుకు ఈ అబ్బాయి. ఇతనికిమాత్రం ఆ బుద్ధులు వుండవని నమ్మకమేమిటి? చెట్టు ఒకటైతే విత్తు ఒకటౌతుందా? ఛస్తే ఈ సంబంధం చేయడానికి వీల్లేదు. నాపిల్ల గొంతు కోస్తారా? అది కాపరం సరిలేక అఘోరిస్తుంటే అప్పుడు ఆ వుసురు ఎవరికి? మనక్కాదా.

పిల్లదాని సుఖంకన్న మనక్కావల్సిందేమిటి? ఆలస్యమైనా మంచి సంబంధమే చూసి చేయండి" అంటూ కూర్చుని ఆ సంబంధాన్ని చెడగొట్టేసిందికదూ!

"ఇప్పుడుమాత్రం నీకొచ్చిన లోటేఁవిటి? నీభర్త నిన్ను సుఖపెట్టడంలేదా? నిన్ను ప్రేమించడం లేదా?" అంది అంతరాత్మ.

"ఛ...ఛ...పాడు ఆలోచన్లు. ఈ రోజు నాకేమయ్యిందీ? నా ఆలోచనన్నీ ఇలా సాగుతున్నాయేం?" కలతపడే మనసుతో ఎప్పటికో నిద్రపోయింది కమల.

నిద్ర సరిగ్గా పట్టనికారణంచేతో, లేక ఆ ఆలోచన్లవల్లనో తెల్లవారేసరికి తలపోటు ప్రారంభించింది. తనకోసం ఎన్నోపనులు ఎదురుచూస్తూవుంటాయి, అనుకోగానే లేవాలనిపిస్తున్నది. లేస్తే తలవూడిపడిపోతుందేమో అనేంత బాధతో లేవలేకపోతున్నది కమల. నీరసం, నిస్సత్తువ ఆమెను లేవనివ్వకుండా జోకొట్తున్నాయి.

భక్తిరంజనికంటె ముందే తమకు కాఫీలందించే భార్య ఆ రోజు తెలుగు వార్తలు పూర్తయినా ఇంకా లేవకపోయేసరికి భర్తకు అనుమానంవచ్చి భార్యను పిలిచాడు గట్టిగా. "కమలా, కమలా" అంటూ. ఎంతసేపు పిలిచినా "ఊఁ, లేస్తున్నానండీ" అంటున్నదే గాని లేవలేకపోతున్నది కమల. ఆమె నుదుటిమీద చెయ్యివేసి చూసాడతను.



గ్లాసులో రాధ కనబడిందతనికి. అతని గుండెలోని బాధ ఆ క్షణంలో కళ్ళవెంట రక్తమై ప్రవహించింది.

"రాధా!" అని గొణుక్కున్నాడు.

గ్లాసులోని ఔషధాన్ని విషంతాగినట్టు తాగి, లేచివెళ్ళి కిటికీదగ్గరగా నించున్నాడు. బయట వెన్నెల అతి మనోహరంగా పట్టపగ్గాలేకుండా అమృతాన్ని కురుస్తోంది. అతని మనోఫలకంపైన ఎన్నోజ్ఞాపకాలు కదులుతూ మనసుని సొరచేపల్లా తింటున్నాయి. తనీవూరు రాకపోయినా బావుండేది అనుకొన్నాడు చిట్టిబాబు.

కిటికీ వెలుపల పందిరి కల్లుకొన్న జాజిపందిరి. సన్నజాజిపూలతాలూకు పరిమళం మత్తుగా గదిలోకి దూసుకొస్తోంది.

నాలుగు సంవత్సరాలైంది రాధని చూసి. ఈ నాలుగుసంవత్సరాలనించీ కూడా ఆమెని మర్చిపోవాలని చిట్టిబాబు ప్రయత్నం. కేవలం ఆ ప్రయత్నంలోనే అతనికి తాగుడు అలవాటు అయింది.

మర్చిపోవాలన్నా మర్చిపోలేని తన ప్రాణంలాంటి రాధ. ఫోటోఫ్రేంలో వున్న రాధ ఫోటోవంక చూసేడు ఓసారి.

సన్నగా, నాజూగ్గా, కాశీరత్నంతీగలాగ వుండేది. అప్పట్లో రాధ నవ్వితే మల్లెమొగ్గలు దోసిట్లో రాలతాయనిపించేది. రాధకి పెళ్ళయి ఏదో దూరంగా వెళ్ళిపోయి వుంటుందనుకొన్నాడు చిట్టిబాబు. కానీ ఈ వూళ్ళోనే వుందని తెలీదు. తెలిస్తే అసలు వచ్చేవాడు కాదేమో కూడానూ.

చిట్టిబాబు చేతిలోని సిగరెట్టుని కసిగా బయటికి విసిరాడు. చిట్టిబాబుకి, ఫ్రేంలో వున్న రాధ ఫోటోని ముద్దుపెట్టుకోవాలనిపించింది. పెదవులకి అతిచేరువుగా తీసుకోబోయి ఎవరో చెయ్యిపట్టి ఆపినట్టుగా ఆగిపోయాడు.

"తప్పు" అనిపించింది అతనిలోని మానవత్వానికి.

ఒకప్పుడు రాధ తన హృదయ సామ్రాజ్యానికి సాక్షాత్తు దేవత. కానీ ఇప్పుడు తనకేమీ కాదు. మరో మనిషికి భార్య. ఆ నిజం గుర్తుకొచ్చేసరికి చిట్టిబాబుకి ఏడుపొచ్చింది. అంతబాధలోనూ అతని పెదవులపైన ఓ తాత్వికమైన చిరునవ్వు బాధగా కదలింది.

'రాధా నీకు నేను ఏమీకానా?' అనుకొన్నాడు.

అతని కళ్ళల్లోకి నీరు ఉప్పెనలా పొంగింది.

చిట్టిబాబు చదువుకొనే రోజుల్లో చలపతి అతని ప్రాణస్నేహితుడు. అతనికోసం తరుచుగా వెళ్ళేవాడు చిట్టిబాబు. చలపతి చెల్లెలు రాధ.

కేవలం మొదట్నుంచీకూడా ఓ విధమైన ఆకర్షణకి గురైపోయి ఒకరికొకరు దగ్గరయ్యారు. రాధ బి.ఏ. తప్పి చదువు

మానుకొంది. అదే సమయంలో చలపతికి ఉద్యోగం రావడంతో వేరే వూరు వెళ్ళిపోవడంతో వాళ్ళింటికి వెళ్ళే అవకాశాలు తగ్గాయి. కానీ మనసుని కళ్ళెంతో కడితే ఆగేదికాదు. ఒకళ్ళ కొకళ్ళు ఒక్కరోజు కనబడకపోతే వెర్రిగా వుండేది.

చిట్టిబాబుకి రాధ మనస్తత్వం బాగా తెలుసు. పెంకితనం జాస్తి. మధ్యతరగతి కుటుంబానికి చెందిందే అయినా, తండ్రి లేకపోవటంచేత అతిగారాబంగా పెంచేరు అన్నలు. మొదట్లో రాధ పెంకిగా మాట్లాడుతుంటే చాలా ముచ్చటగావుండే దతనికి. కాని శ్రుతిమించిపోతుందని కలలోకూడా అనుకోలేదు.

ఆ రోజు బాగా గుర్తు చిట్టిబాబుకి.

సాయంత్రంవేళ తోటలో కూర్చున్నప్పుడు.

"ఈవేళ ఏమయినా సరే. మన విషయం తేల్చేయాల్సిందే" అన్నాడు.

"ఏమిటీ?" అంది. రాధ అడిగిన 'ఏమిటి'లో చిట్టిబాబుకి వెటకారం ధ్వనించింది. రాధ మొహంలోకి పరీక్షగా చూసి.

"అదే. పెళ్లి గురించి" అన్నాడు.

"ఎవరి పెళ్లి?" తిరిగి అదే ధోరణిలో అడిగింది.

మొదట్నుంచీకూడా రాధ పెడసరంగా మాట్లాడినా సర్దుకుపోయే అలవాటుని చేసుకొన్నాడు. రాధకి తెలుసు, తనలోని బలహీనత. ఒక్కరోజుకూడా చిట్టిబాబు తనని చూడకుండా వుండలేడని. అందువల్లనే ప్రతి విషయంలోనూ తన మాటా, తన పంతమే నెరవేర్చుకోడానికి చిట్టిబాబు బలహీనతని ఆధారం చేసుకొనేది.

చిట్టిబాబు టీపాయ్‌పైనవున్న ఏష్ట్రేని చేతివేలితో కొడుతూ అడిగేడు.

"నీకు ఏమీ తెలీనట్టే అడుగుతున్నావే?" అన్నాడు.

రాధ చివాల్న తలెత్తిచూసింది.

"తెలీకకాదు. చాలా తెలుసు. మీరు చెప్పని విషయాలు, చెప్పలేని విషయాలు. ఒకటి కాదు. వందలూ, వేలూ తెలుసు," అంది.

చిట్టిబాబు ఆ మాటలవరసకు అప్పుడు కలవరపడ్డాడు.

"ఏమిటి నువ్వనేది?" అన్నాడు కొంత అసహనంతో.

రాధ గుండెలు ఆవేశంతో ఎగిసిపడుతుండగా అన్నది.

"నిన్న సాయంత్రం క్లబ్బులో మీ హీరోయిజం గురించి విని చాలా ఆనందించేను."

అప్పుడు చిట్టిబాబు నవ్వి. "నేను నీ కొక్కడికే హీరోని," అన్నాడు.

"ఆ మాట అనడానికి సిగ్గుండాలి. ఏం ఆడపిల్లంటే మీదృష్టిలో బజార్లో దొరికేబొమ్మనుకొంటున్నారా? చెప్పండి. నేను మీకేం ద్రోహంచేశానని, నన్నిలా మోసం చెయ్యాలనుకొన్నారు?" రాధ ఆవేశంగా అడుగుతుంటే అసలు సంగతేవిటో అర్థంగాక చిట్టిబాబు-

"అసలు విషయం చెప్పి తర్వాత సందేహాలు తీర్చుకొంటే బాగుంటుంది" అన్నాడు.

రోషంగా చూసింది.

"ఏం-మీకు తెలీదా? ఏమీతెలీకే ఇలా నంగి కబుర్లు చెబుతూ ఆటలాడుతున్నారా?" అడిగింది.

"నన్నిలా పబిల్‌లో ముంచెత్తి దారుణంగా మాటల్తో చిత్రవధ చెయ్యడం అన్యాయం. నీకేం కావాలో, నన్ను గురించి ఏం విన్నావో చెప్పు. ఎదురుగా మనిషినే వున్నాను. నిజమో కాదో చెప్తాను," అన్నాడు.

"శోభ మీకు తెలుసా?" అడిగింది.

"తెలుసు."

"ఎలా తెలుసు?"

"నాతోపాటు చదివింది."

"ఆ అమ్మాయి, మీరు కలిసి తిరిగేవారు కదూ?"

"శోభ నా స్నేహితురాలు."

"అంతేనా. లేక ఇప్పుడు నాకోసం ఇక్కడికొస్తున్నట్టు, ఆ పిల్లతోనూ తిరిగేవారా?" చిట్టిబాబుకి రాధ ఎందుకలా మాట్లాడుతుందో అర్థం అయింది. అసహ్యం అనిపించింది.

"నా స్నేహితురాలు. అంతే! కేవలం శోభ నన్ను లైక్‌చేసేది." అన్నాడు.

"సిగ్గులేకపోతేసరి. లైక్‌చేసేవట లైక్. కేవలం ఆ స్నేహంతోనే ఆపిల్ల బ్రతుకుని నాశనంచేశారా ?"

"రాధా! హద్దుమీరి మాట్లాడుతున్నావ్?" కోపంగా అన్నాడు చిట్టిబాబు.

"ఉన్నమాట అంటే వులుకెక్కువట. ఏ-నేనన్నమాట నిజంకాకపోతేనే మీకు అంత కోపంవచ్చిందా? మీమధ్య ఏమీ లేకపోతేనే రిక్షాలెక్కి తిరిగేవారా? సినిమాల కెళ్లేవారా?"

"నీకసలు ఎవరు చెప్పారు?" అడిగేడు.

"ఎవ్వరు చెబితే ఏం. నిజంకాదని చెప్పగల దమ్ములు మీకున్నాయా?"

"ఒక్కమాట అడుగుతాను. సమాధానం చెప్తావా రాధా," అడిగేడు చిట్టిబాబు.

"సమాధానం చెప్పతగ్గ ప్రశ్న అయితే తప్పకుండా చెప్తాను." అంది రాధ.

చిట్టిబాబు చేతివేళ్ళమధ్య కాలుతోన్న సిగరెట్టుని అవతలపడేసి అన్నాడు.

"మ్మనిద్దరం పబ్లిక్ గార్డెన్స్‌లో గంటల తరబడి కూర్చునేవాళ్ళం. నౌబత్ పహాడ్‌కి లెక్కలేనన్నిసార్లు వెళ్ళాం. రిక్షాలు, ఆటోరిక్షాలు ఎక్కాం. కలిసి సినిమాలకి వెళ్ళాం. నే నెప్పుడైనా

నీ విషయంలో అసభ్యంగా ప్రవర్తిం చేనా?"

రాధ చిట్టిబాబువంక కసిగా చూసింది.

"నమ్మించడానికిదో నాటకం. అయినా అదీ, నేనూ ఒక్కటేనన్నమాట మీ దృష్టిలో. ఏదైనా నాటకాల కంపెనీనో, సినిమావాళ్ళనో నమ్ముకోరాదూ? యిట్టె పైకొచ్చేస్తావ్?"

"రాధా!నీ వితండవాదంతో నన్ను విసిగించకు. నిన్ను నమ్మించడానికింత నాటకం అవసరంలేదు. నేను నిన్ను ప్రేమించకపోతే నీపైన నాకుంది కేవలం కోరికే అయితే, దొరికిన అవకాశాన్ని ఎప్పుడో ఉపయోగించుకొనేవాడిని."

"అంటే, చెడ్డదాన్నని తప్పుకూడా నాపైనే తోస్తున్నావా? ఛీ" అంది రాధ. చిట్టిబాబు ఆవేశంతో వళ్ళుమరిచిపోయాడు. రాధ చెంప ఛెళ్ళుమంది.

అప్పుడు రాధ కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

"చెంపదెబ్బతో నోరు ముయ్యించలేవు చిట్టిబాబు. కానీ నువ్వు నా గుండెపైన కొట్టిన ఈ దెబ్బని మాత్రం జీవితంలో మరచిపోను. నేను విడిచే ప్రతి కన్నీటి బొట్టూ నిన్ను దహించేస్తుంది. ఆడపిల్లవుసురు వూరికేపోదు. నువ్వు నాశనం అయిపోతావ్?" అంది.

"రాధా! దయచేసి లోపలకెళ్ళిపో. నన్ను కాసేపు ప్రశాంతంగా వుండనీయి" అన్నాడు చిట్టిబాబు,తన తొందరపాటుకి కలవరపడుతూ.

"లోపల కెళ్ళమని చెప్పడానికి నువ్వెవడివి?" ఇది నా ఇల్లు. నా ఇష్టం. చిట్టిబాబూ! కాస్త అందగాడివయ్యేసరికి నీవేపు కన్నెత్తిచూసిన ఆడపిల్లనల్లా నాశనంచేస్తున్నావు, ఐ మస్ట్ థాంక్ గాడ్. నేను నీకు బలికాకముందే కళ్ళు తెరిచాను."

రాధకెలా నచ్చచెప్పాలో అర్థం కాలేదు చిట్టిబాబుకి.

"ఏదో ఒకరోజు నిజం నీకే తెలుస్తుంది. ఆ రోజు గుండె పగిలేలా ఏడుస్తావ్. ఒక ఆడపిల్ల ఒక మగాడితో మాట్లాడితే నేరమే. సంస్కృతీ, నాగరికత ఎంత పెరిగినా, మనుషుల మనసులుమాత్రం ఎదగలేదు రాధా. కేవలం శోభ నా చెల్లెల్లాటిది."

అప్పుడు రాధ పకపకమని నవ్వేసింది.

ఆటుతర్వాత అతనివంక చూస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకొంది.

"వండర్‌ఫుల్, నరుకు చిట్టిబాబూ నరుకు. కథలు రాసిరాసి చెయ్యితిరిగినవాడివి. నువ్వేం చెప్పినా నమ్మేలా చెప్తావు. ఇదివరకు నీ స్నేహాన్ని, నీ ప్రేమనీ పొందినందుకు, నీ పక్కన నన్ను వూహించుకొని మురిసిపోయాను. కానీ ఇప్పుడు నిన్నుచూసి సిగ్గుపడుతున్నాను. ప్లీజ్ వెళ్ళిపో. తిరిగి నాకు కనబడ్డానికి ప్రయత్నం చెయ్యకు?" అని రాధ విసవిస లోపలకి వెళ్ళిపోయింది.







చిట్టిబాబు దిక్కుతోచనివాడై రోడ్డుపైకొచ్చేడు.

——మంచంపైన పడుకొని సిగరెట్టు తాగుతూ ఎర్రలైటువంక చూసేడు చిట్టిబాబు. ఇంకా తాగాలని వుందతనికి.

ఈమధ్య ఆరోగ్యం పాడైపోయింది. ఊపిరితిత్తులు బలంగా దెబ్బతిన్నాయని డాక్టరు చంద్ర చెప్పేడు. కానీ కావాలనే ఏ విధమైనటువంటి శ్రద్ధాతీసుకోడంలేదు. తను బ్రతికి సాధించేదేముంది గనక భయపడాలి?

సాయంత్రం క్లబ్బునించి కార్లో ఇంటికి వస్తుంటే, రాధ బస్టాప్‌లో నించునుంది జనంతోపాటుగా. రాధ పక్కనే గోపాలరావున్నాడు. గోపాలరావు తనాఫీసులోనే గుమాస్తాగా చేస్తున్నాడు. రాధ అలా జనంతో పాటుగా బస్సుకోసం నిరీక్షించడం చిట్టిబాబుకి ఏమీ నచ్చలేదు.

రాధ తనభార్య అయితే కార్లోతిరిగేది. తన పక్కనే ఇదే కార్లో వుండేది. కానీ తను ఆఫీసరుగిరీ వెలగబెడుతున్న ఆఫీసులోనే ఓ గుమాస్తాగాడికి భార్యఅయి, సామాన్యమైన మనిషిగా, బస్సుకోసం నించునే పరిస్థితికి రావడానికి కారణం కేవలం ఆరోజు రాధ తనని అపార్థంతో దూరంచేసుకోవడమే.

కారు ఆపి వాళ్ళకి లిఫ్టు ఇవ్వాలనిపించింది. బస్‌స్టాపుకి కొద్దిదూరంలో కారాపేడు. కానీ అదేవేళకి ఓ బస్వచ్చి

ఆగడం, జనంతోపాటుగా వాళ్ళు బస్సు ఎక్కడం జరిగిపోయింది.

రాధ తన స్థాయికంటే ఎక్కువైన వాణ్ణి పెళ్ళాడి, మేడల్లో వుంటూ, కారుల్లో తిరుగుతూవుంటే సంతోషించే వాడు.

గోపాల్రావు ఆఫ్ట్రాల్ ఓగుమాస్తా.

తనముందు సార్, సార్ అంటూ చేతులు కట్టుకొని నించుండే ఓ అతి సామాన్యమైన గుమాస్తా. రాధని ఓ గుమాస్తా భార్యగా వూహించుకోలేక పోతున్నాడు చిట్టిబాబు.

గోపాల్రావుని వచ్చిన దగ్గర్నుంచీ గమనిస్తూనే వున్నాడు చిట్టిబాబు. చాలా మంచివాడు. తన వ్యక్తిత్వాన్ని కాపాడు కోడానికి శక్తివంచనలేకుండా అతను పాటుపడతాడు. ఆఫీసు వర్కులో కూడా అందెవేసినచెయ్యి అని తెలుసుకోడానికి గట్టిగా నాలుగురోజులైనా పట్టలేదు చిట్టిబాబుకి.

ఎందుకో కారణంలేకుండా ఆక్షణంలో చిట్టిబాబుకి గోపాల్రావుపైన జెలసీ లాంటిది కలిగింది. గుండెల్లో సన్నటిబాధ చెలరేగింది.

దగ్గు తెరవచ్చి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

చిట్టిబాబుకి జీవితం నిస్సారంగానూ, బరువుగానూ అనిపించింది. నిజమే. తను ఈ నాలుగేళ్ళుగా రాధలేకుండా ఎలా వుండకలిగేడో అర్థంకాలేదు. ఇంత కాలంగానూ, ఎప్పుడో రాధ కనబడు తుందనీ, తను పొరపడ్డాననీ పశ్చాత్తా పంతో కుమిలిపోయి, తన గుండెల్లో కరిగిపోయి వెక్కివెక్కి ఏడుస్తుందను కొన్నాడు. కానీ అనుకోకుండా రాధని ఈరోజు బస్టాపులో చూసేడు.

'గోపాల్రావు అదృష్టవంతుడు' అనుకొన్నాడు చిట్టిబాబు. విస్కీసీసా ఖాళీఅయింది.

తలుపు తడుతోన్న చప్పుడు విన బడుతుంటే తూలుతూవెళ్ళి తలుపు తెరి చాడు. చిట్టిబాబు తలుపువెనక నించు నున్న అక్కగార్ని, బావగార్ని చూసి చిరునవ్వుని పెదవులపైకితెచ్చుకొంటూ—

"రండక్కయ్యా!" అన్నాడు.

సుభద్ర విసవిస లోపలికి నడిచింది ఎయిర్ బాగ్‌తో.

"చూసేవా సుభద్రా, మీ తమ్ముడి గురించి మనం విన్నది అక్షరాల కరెక్టు" అన్నాడు చిరంజీవి.

వాళ్లు తన గురించి ఏంవినివుంటారో చిట్టిబాబుకి తెలీందేమీకాదు. తాను తాగు బోతయిపోయాడని వినివుంటారు. ఆరోగ్యాన్ని చెడగొట్టుకొన్నాడనితెలుసు కొనివుంటారు. రాధనిగురించిన ఆలో చనలుమాని, పెళ్ళిచేసుకొని బుద్ధిగా పడుండమని చెప్తారు. అంతే!

"ఏరా, నువ్వు పెద్దవాడివయ్యావు. పెద్ద వుద్యోగం చేస్తున్నావు. ఒకరికి చెప్పవలసినవాడివి నువ్వు. అలాంటిది నువ్వే ఈ విధంగా చెప్పించుకోడం నాకేమీ బాగాలేదురా" అంది సుభద్ర.

"ఇప్పుడేమయిందనీ?" అన్నాడు చిట్టిబాబు.

"చూసేరా, వాడేమంటున్నాడో. తనేం కాలేదట. మల్లెపువ్వులాంటివాడు ఎలా అయిపోయాడో. ఆపిల్లకి పెళ్ళయి వేరే కాపురం చేసుకొంటోంది. ఇంకా ఆ అమ్మాయిని గురించి ఆలోచించి మనసు పాడుచేసుకొని, ఆరోగ్యాన్ని పాడుచేసుకొని ఏమిట్రా ఇది!" సుభద్ర గొంతులో అంతులేని ఆవేదన కనబడింది.

"అదికాదోయ్ చిట్టిబాబూ, నీకేం తక్కువైందని చెప్పు. నువ్వు పెళ్ళి చేసుకొని, సుఖంగావుంటే సంతోషిస్తా. నువ్విలావుంటే మీ అక్కయ్య నిన్ను గురించి దిగులుతో సగం అయి పోతోంది. నిన్నుగురించి నీకు లేక పోవచ్చు. కానీ మాకోసమైనా నువ్వు సంతోషంగా వుండాలి. అవునా?" అన్నాడు చిరంజీవి.

చిట్టిబాబుకి కేవలం వాళ్ళొచ్చింది తనకి జ్ఞానబోధ చెయ్యడానికని తెలుసు కోడాని కాట్టేసేపు పట్టలేదు. తను పెళ్ళి చేసుకోవాలట. సుఖంగా వుండాలట.

వాళ్ళ కోరిక న్యాయమైందే. కానీ అదెలా సాధ్యమవుతుంది.

చిరంజీవి అడిగిన మాటలకి తిరిగి ఈ లోకంలో పడ్డాడు చిట్టిబాబు.

"ఎన్నిసీసాలు తాగుతున్నావు?"

అక్కగారి ముందు బావ అలా అడ గడం చిట్టిబాబుకి నచ్చలేదు. కానీ బావ గారి హోదాలో తనని మందలిస్తున్న ధోరణి కనబడింది.

చిట్టిబాబు లేచి, "ఇక పడుకోం డక్కయ్యా. ఉదయం మాట్లాడు కోవచ్చు" అన్నాడు.

* * *

చిట్టిబాబు ఫైళ్ళు చూస్తూ కూర్చు న్నాడు.

"సార్, పిలిచేరా?" అన్నమాటలకి తలెత్తిచూసేడు చిట్టిబాబు.

గోపాల్రావు చేతులు కట్టుకొని నిల బడి వున్నాడు.

"కూర్చోండి" అన్నాడు చిట్టిబాబు.

గోపాల్రావు సందేహంగా చూసేడు.

"ఫర్లేదు కూర్చోండి" అన్నాడు.

గోపాల్రావు బెరుగ్గా కూర్చున్నాడు.

చిట్టిబాబు బజర్ నొక్కాడు. బోయ్ తలుపు తోసుకొని లోపలకొచ్చేడు.

"రెండు కాఫీ తీసుకురా!" అని గోపాల్రావుకేసి చూసేడు చిట్టిబాబు.

"సార్" అన్నాడు, ఏదో అడగాలను కొన్నట్టుగా.

"సాయంత్రం మీకు ఏమైనా పనులు గానీ వున్నాయా?" అడిగేడు అతను వేరే మాట్లాడేందుకు అవకాశాన్నివ్వ కుండాను.

"లేదార్."

"ఈవేళసాయంత్రం నాతో గడవ గలరా?" అడిగేడు.

"భలేవారేసార్. మీరు చెప్పడం, నేను కాదనడమా?"

"చూడండి గోపాల్రావుగారు, నాకంటూ చెప్పుకోదగ్గ స్నేహితులు ఎవరూ నాకులేరు. నేను ఆఫీసర్నన్న విషయం మర్చిపోయి, మీ స్నేహాన్ని నాకు పంచవలసిందిగా కోరుతున్నాను."

గోపాల్రావు ఆశ్చర్యంగా చూసేడు.

బాయ్ కాఫీ తెచ్చాడు.

"తీసుకోండి."

"సార్ ఇది ఆఫీసు. మీరు చనువుగా వుండడానికి ఇది అనువైన వాతావరణం కాదు."

చిట్టిబాబు నవ్వేడు అతనిమాటలకి.

"జీవితంలో తేరుకోలేని చావుదెబ్బ తిన్నవాణ్ణి నేను— ఇప్పుడు ఎలాంటి పరిస్థితినైనా సునాయాసంగా ఎదుర్కో గలశక్తి నాకుంది. మీరు ఏ విషయం లోనూ భయపడవలసిన అగత్యంలేదు."

కాఫీలు తాగేక అన్నాడు చిట్టిబాబు, లేచి గోడకేలండరు దగ్గరగా నడుస్తూ.

"రేపు పదిహేనో తారీఖు. ఈ నెల్లో ఈ తారీఖుకి నేను అమితమైన ప్రాముఖ్యత నిస్తాను" అన్నాడు.

"ఏమిటిసార్?" అన్నాడు గోపాల్రావు.

"చెప్పలేను. చెప్పేశక్తి నాలోలేదు. ఏం, సెప్టెంబరు పదిహేను అంటే మీకిష్టం లేదా?" అనడిగేడు.

"నాలాంటి గుమాస్తాలకి ఏ రోజైనా ఒకటే" అన్నాడు.

చిట్టిబాబుకి బాధనిపించింది. సెప్టెంబరు పదిహేను రాధ పుట్టినరోజు.

రాధ, రేపటిరోజున పుట్టినరోజు పండుగ ఘనంగా జరుపుకొంటుందను కొన్నాడు. కానీ రాధభర్త ఇంత దౌర్భాగ్యుడై పోయి, ఒకనాడు తన ప్రాణం లోనూ, మనసులోనూ, ఆరాధ్యదేవతై వెలిసిన రాధ బర్త్‌డేనే మర్చిపోయి నందుకు అమితమైన కోపం అతనిపైన కలిగింది.

"అయిదయింది. పదండి, అలా బజార్లోకి వెళదాం" అన్నాడు చిట్టిబాబు.

ఖరీదైన బార్ ముందు ఆగిన కార్లోంచి దిగిన చిట్టిబాబుని చూసి గోపాల్రావు చాలా ఇబ్బందిగా అడిగేడు.

"లోపలికి రాకతప్పదంటారాసార్?"

గోపాల్రావు చేతిని నొక్కి చిట్టిబాబు—"తప్పు, నన్ను సార్ అని పిలవకు మిస్టర్ గోపాల్రావ్. 'సార్,' 'ఏమండీ' పదాలని తీసేసి — ఇహమీదట ఎలా పిలిచినా పలుకుతాను. పదండి" అన్నాడు.

అక్కడి ఖరీదైన వాతావరణాన్ని గోపాల్రావు వింతగా చూడ్డాన్ని గమనించి నవ్వుకొన్నాడు చిట్టిబాబు.

బేరర్ తెచ్చిన విస్కీసీసాలోని ఔషధాన్ని రెండు గ్లాసుల్లోకి పోసి, "ఛీర్స్" అన్నాడు చిట్టిబాబు గ్లాసుని చేతిలోకి తీసుకొని.



"నన్ను చాలా ఇబ్బందిపెడు తున్నారు. ఇదివరలో నేనెప్పుడూ తాగ లేదు. పైగా నాలాంటివాళ్ళ కిదితీసుకొనే అర్హతకూడా లేదు!"

గోపాల్రావు మాటలకి చిట్టిబాబుకి కష్టం కలిగింది.

"అలా మాట్లాడితే నేను చాలా బాధ పడతాను. దయచేసి ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకండి. ఆల్‌రైట్. డోన్ట్‌వర్రీ. లీవ్ ఇట్" అన్నాడు.

చిట్టిబాబు తాగుతుంటే గోపాల్రావు చూస్తూ కూర్చున్నాడు.

"మీరు అన్నీ వుండీ, ఎందుకింత నైరాశ్యంగా వుంటున్నారో అర్థంకావడం లేదు." అడిగేడు గోపాల్రావు. చిట్టిబాబు అతనివేపు చూసేడు.

చిట్టిబాబు పెదవులపైన బాధతో కూడిన చిరునవ్వొకటి కదిలింది.

"నా మనసులోని దౌర్భాగ్యం ఎలాం టిదో నీకు తెలిసినరోజున, నా నిజ స్వరూపం ఏమిటో నీకళ్ళ కగపడిన రోజున, మిస్టర్ గోపాల్రావు నువ్వు పైగరై పోతావు. వళ్ళు మరిచిపోయేలా తాగేస్తున్నాను. దయచేసి నా పర్సనల్ విషయాలు మాట్లాడకండి. వళ్ళు తెలీక నేను ఏం మాట్లాడినా ప్రమాదమే" అని చెప్పాలనుకొన్నాడు. కానీ అతని మాటలు గొంతులోనే మిగిలిపోయాయి.

"మాట్లాడరేం?" అడిగేడు గోపాల్రావు.

"మనసు నిర్మలమయిందవుతే దానికి ఏమాత్రం తాకిడి తగిలినా అల్లకల్లోలం అయితీరుతుంది మిష్టర్ గోపాల్రావు! మీరు నాకొక్క మాటఇవ్వాలి" అలగా అడిగేడు.

"తప్పకుండానూ" అడగండి, అన్నాడు.

"ఎలాంటిపరిస్థితిలోనూ మీరు నా స్నేహాన్నిమాత్రం విడిచిపెట్టకూడదు. ప్రతిరోజూ మీరు మీ కంపెనీ ఇచ్చి నన్ను బ్రతికించాలి. మిమ్మల్ని చూస్తుంటే నేను సర్వాన్నీ మర్చిపో గలుగుతున్నాను. అదీకాక మరో ముఖ్య విషయం. గత నాలుగేళ్ళుగా నేను తాగని రోజులేదు. ప్రస్తుతం నా ఆరోగ్యం కూడా చాలా దెబ్బతింది. ఈమధ్య కొత్తగా నన్ను గుండెజబ్బొకటి పీడిస్తోంది."

"సార్" అన్నాడు గోపాల్రావు.

"ఇప్పటికే చాలా ఆలస్యంఅయింది. పదండి పోదాం," అని లేచాడు చిట్టిబాబు. కారు కదిలింది.

తాగిన మనిషి కారు సరిగ్గాతోలగలడో లేదో అని గోపాల్రావు భయపడ్డాడు. కానీ తన ప్రాణాలకంటే విలువైనదే చిట్టిబాబు ప్రాణం. అతనికి లేనిభయం, తనకుండడం న్యాయం కాదనిపించింది. కానీ తననంటూ నమ్ముకొన్న భార్య ఇంట్లోవుంది.

చిట్టిబాబు కారుని ఆపి, "నౌబత్

మహల్ గోపురాన్ని కూల్చేశారు."

ఆ దిక్కుగా కొండపైన వెలుగుతోన్న లైట్లని చూస్తూ బాధగా అన్నాడు.

"అవును. అక్కడేదో గుడి కడుతున్నారట" అన్నాడు గోపాల్రావు.

"నౌబత్‌పహాడ్ నా ప్రేమకి, నా సెంటిమెంటుకి సింబల్ గోపాల్రావు గారూ. నేనూ, తనూ ఎక్కువగా అక్కడే కలుసుకొనేవాళ్ళం", అన్నాడు.

"తనంటే?"

గోపాల్రావు ప్రశ్నకి చిట్టిబాబు అతని మొహంలోకి చూసేడు.

ఒకప్పుడు నా హృదయంలో కోటి దీపాలు వెలిగించిన నా ప్రియురాలు "

"ఆమె ఇప్పుడెక్కడుంది?"

"పెళ్ళిచేసుకొని కాపురంచేస్తోంది"

"మిమ్మల్ని మోసంచేసిందా?"

"లేదు. అర్థంలేని అహంకారంతో నన్ను కాదనుకొంది. అంతే."

"అలాంటి మనిషికోసం మీరు ఎందుకంత వర్రీ అవుతున్నారు?"

చిట్టిబాబు జేబులోంచి సిగరెట్టు పెట్టె తీసి వెలిగించాడు.

"సెంటిమెంట్సు వున్న ఏ మగాడూ ప్రేమించిన ఆడదాన్ని అంత తేలిగ్గా మర్చిపోలేడు. అదీకాక ఇద్దరిమధ్య ఆత్మీయత పెరిగేక విడిపోడం అన్నదే మరీ దురదృష్టకరమైన విషయంకాదా గోపాల్రావుగారు."

"ఆవిడ ఈవూళ్ళోనేవుంటున్నారా?"

"ఈ వూళ్ళోనే వుంటోంది. కాని నేనూహించని విధంగా తను కార్లలో తిరగడంలేదు. మేడల్లో నివసించడం లేదు. అందమైన బొమ్మకొట్లల్లో ఆడుకోటంలేదు."

"అంటే?" అడిగేడు గోపాల్రావు.

"ఓ సామాన్యమైన మనిషికి భార్యగా తన విధులని నిర్వహిస్తోంది. అది నేను భరించలేకపోతున్నాను."

చిట్టిబాబు మాటలకి గోపాల్రావు అడ్డుపడి అడిగేడు. "తిరిగి ఆవిడ్ని కలుసుకోలేదా?"

"లేదు తనని చూసి నాలుగేళ్ళయింది. అయినా ఇప్పుడు కలుసుకొని చెయ్యగలిగిందేముంది." చిట్టిబాబు విరక్తిగా అన్నాడు.

గోపాల్రావు మాట్లాడలేదు.

"నౌబత్‌పహాడ్ గోపురం కూల్చివేశారు. నా ప్రేమకూడా పూర్తిగా సమాధి అయిపోయింది." అతని కళ్ళల్లో నీరు తళుక్కున మెరిసింది.

"పదండి వెళదాం" అన్నాడు గోపాల్రావు.

కారు కదిలింది.


గోపాల్రావు ఆ తర్వాత మాట్లాడకుండా వూరుకున్నాడు.

* * *

"ఏరా తమ్ముడూ, నొప్పి ఎలా వుంది?" అడిగింది సుభద్ర.

చిరంజీవి కోపంగా అన్నాడు.





"ఆపరేషనెందుకు? మరో నాలుగు సీసాలు పడేస్తే మందు. సుఖంగా తాగుతాడు."

చిట్టిబాబు నవ్వేడు.

"బావగారు కోప్పడుతున్నారు. చూసేనా అక్కయ్యా" అన్నాడు.

"ఎందుకొచ్చిన తిప్పల్రా ఇవి. ఒరే నా మాటవిని 'పెళ్ళిచేసుకోరా!" అనునయంగా అడిగింది సుభద్ర.

"నీ కోరికతూరుంటే తప్పకుండా చేసుకొనేవాడి నక్కయ్యా. నాకా అదృష్టంకూడా లేకపోయింది."

సుభద్రకళ్ళల్లో నీరుగిర్రునతిరిగింది.

"అవున్రా నిజమే. వయసులో నీకంటే మరో పదిహేను ఏళ్ళు పెద్దదాన్నయుంటే తప్పకుండా అదే జరిగుండేది. ఆ మహాతల్లి నీ జీవితాన్ని పొట్టన పెట్టుకొంది."

"తననేం అనకక్కయ్యా. నాకు బాగోదు. నేనిలా అవ్వాలని రాసిపెట్టి వుంటే ఎవరుమాత్రం ఏం చెయ్యగలరు?"

సుభద్ర లేచి లోపలికెళ్ళింది. గుండె నొప్పిరావడంచేత ఆ రోజు చిట్టిబాబు ఆఫీసుకు వెళ్ళలేదు.

పన్నెండుగంటలవేళ గోపాల్రావు చిట్టిబాబుకోసం వచ్చాడు.

"సార్, ఇప్పటివరకూ ఆఫీసులో చూసి చూసి మీ కోసం ఇటువచ్చాను" అన్నాడు.

"ఏమిటి విశేషం?"

"నిన్న మీరన్నారు. ఈరోజు మీకు చాలా ఇష్టమైన రోజని. కానీ ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే నాక్కూడా ఇది చాలా ముఖ్యమైన రోజేసార్. కానీ

ఈవేళ ఉదయంవరకూ మా రాధ అంటే గానీ నాకు గుర్తురాలేదు."

చిట్టిబాబు కళ్ళల్లో కాంతిరేఖలు కదిలేయి.

"ఏమిటంత విశేషం?"

"ఈవేళ తనపుట్టినరోజు. ఘనంగా చేసేశక్తి నాకు ఎలాగూలేదు. మీరొక్కళ్ళే పిలవాలని ఆఫీసుకొచ్చేను. మీరు శెలవు పెట్టారని తెలిసి ఇటొచ్చేను" అన్నాడు.

"అలాగే తప్పకుండా వస్తాను" అన్నాడు చిట్టిబాబు. గోపాల్రావు శెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం రాధకి తన బర్త్ డే కానుకగా ఖరీదైనచీర కొన్నాడు చిట్టిబాబు. అది చాటుచేసుకుంటూ గోపాల్రావు ఇంటి ముందు కారు దిగేడు చిట్టిబాబు.

తలుపులు తెరిచేవున్నాయి. రాధ గుమ్మందగ్గర నించునివుంది. చిట్టిబాబు, రాధనిచూస్తూ నించుండిపోయాడు. రెండు మూడు నిమిషాల పాటు ఇద్దరిమధ్య మాటలులేవు. ఇద్దరి కళ్ళల్లోనూ నీరు సుడులు తిరిగింది.

పరుగెత్తికెళ్ళి అతని గుండెల్లో కరిగిపోవాలనిపించింది రాధకి. అతనితో తను గడిపిన మధురక్షణాలు వరసగా కళ్ళకి కట్టినట్టుగా భ్రాంతిపడింది.

చిట్టిబాబు చేతుల్ని గట్టిగా పట్టుకొని అతని కళ్ళల్లోకి అవ్యాజమైనటువంటి పిచ్చిప్రేమతో చూడాలనిపించింది.

ఓ క్షణంలోనే కర్తవ్యం గుర్తుకొచ్చినదానిలా మనసుని రాయిచేసుకొంది. కానీ అంతరాంతరాల్లోనూ, తను అతనిముందు ఓడిపోతానేమోనని రాధకి భయంగా వుంది.

చిట్టిబాబు ఒక్క అడుగుముందుకివేసి, "రాధా!" అన్నాడు. తను పిలిచీ పిలవంగానే రాధ పరుగెత్తుకొచ్చి తన కౌగిలిలో కరిగిపోతుందనుకొన్నాడు చిట్టిబాబు.

"ఎందుకొచ్చావ్?" అడిగింది తేరుకొని.

"నీ బర్త్ డే పండగని నాచేతులపైగా చేద్దామని" అన్నాడు, రాధ కళ్ళల్లోకి చూస్తూ. "ప్రేమ" అనేమాటకి సరైన అర్థం అతని చూపుల్లోనే వుందనిపించింది రాధకి.

రాధ పెదవులపైన తాత్వికమైన చిరునవ్వొకటి కదిలింది.

"ఆ అర్హత నీకింకా వుందనుకొంటున్నావా? నేనుపరాయి ఆడదాన్ని."

"నువ్వు పరాయిదానివైనా ఎన్నో కోట్ల మైళ్ళదూరానవున్నా నేను పరలోకంలోవున్నా నీ హృదయంలో నాకెప్పుడూ స్థానంవుంటుందని తెలుసు రాధా!"

రాధ కళ్ళల్లో తిరుగుతోన్న నీటిని అతనికి కనబడనీయకుండా ప్రయత్నం చేసింది.

"భ్రమపడుతున్నావ్. గతం అనే ఓ పీడకలలో తారసపడ్డ ఓ మనిషిని. నీకు తెలిదేమో, నీ జ్ఞాపకాలతో నేనేమీ అశాంతితో జీవించడంలేదు."





చిట్టిబాబు కూర్చున్నాడు.

"అశాంతితో జీవిస్తూ ప్రశాంతగా వున్నాననే భ్రమపడటంకూడా చాలాగొప్ప విషయమే. ఇంతకీ గోపాల్రావు లేడా!"

"లేరు. మీరొస్తారని తెలుసు కాబట్టే వారికి వేరేపనిని పురమాయించి బయటికి పంపేను."

"ఎందుకని?"

"మన వెనుక గతం నీడలా వారిని అనుసరించి పీడించకూడదని. మన పాడుకథ వారికి తెలీకూడదని."

జీరపోయిన గొంతుతో రాధ అంటుంటే ఆమె మొహంలోకి పరీక్షగా చూసేడు చిట్టిబాబు.

ఒకప్పుడు రాధ ఎలా వుండేది?

స్వచ్ఛమైన సెలయేరులా తుళ్ళి పడుతూ వుండేది. అలాంటిది చిక్కి శల్యమైపోయి, నీరసించి ఓ జీవచ్ఛవంలా కనబడుతుంటే భరించలేక పోయాడు.

"నేను నీకెప్పుడూ గుర్తురానా? నన్ను చూడాలని నీకనిపించదా?" అడిగేడు. రాధ అతనికళ్ళల్లోకిచూసింది.

"చిట్టిబాబూ! నిన్ను నేను మర్చిపోదమా? నిన్ను చూడాలని నేననుకోని రోజుంటుందా? ప్రతిక్షణంకూడా నీ జ్ఞాపకాలతో చిత్రవధ ననుభవిస్తున్నాను. ఎవరో చెప్పిన మాటవిని, మూర్ఖంగా పట్టుకొని, నిన్ను కష్టపెట్టి, అర్థంలేని అహంభావంతో నిన్ను దూరంచేసుకొన్నాను. నిన్ను క్షమించమని అడిగేందుకూడా నోచుకోలేకపోయిన దౌర్భాగ్య పరిస్థితిలో నేనున్నాను. నీలాంటి మనిషి ప్రేమపొందలేని నేను, నిజంగా అభాగ్యురాలిని" అని చెప్పాలనుకొంది.

కానీ తన మనస్సులో అతనంటే వున్న ప్రేమనీ, అభిమానాన్నీ, అపేక్షనీ, అతనికి తెలియనివ్వకూడదు. కారణం తను పరాయిది. అతను తనకేమీ కాడీరోజున. చిట్టిబాబుకు తన మనసూ, ప్రేమా, అర్థంకాకుండానే వుండిపోవాలి. అతనికేమీ తెలీకూడదు. కేవలం అలాగయితేనే అతనో మనిషిగా బ్రతుకుతాడు. కానీ తాను పరితాపం చెందినట్టు ఏమాత్రంతెలిసినా అతను మనిషిగా వుండలేడు. అదతను భరించలేడు. అందుకే అతన్ని ద్వేషిస్తున్నట్టుగా నటించాలి. ప్రేమించిన మనిషిని కేవలం నటింపులోనే అయినా ద్వేషించడం చాలా కష్టమని తెలుసుకొంది. ఏదో తెలివి బలహీనత ఆవహిస్తున్నట్టుగా వుంది. రాధకి అతనిముందు నిలబడలేననిపించింది.

పూర్వం ఒకసారి నౌబత్‌పహాడ్ పైన కూర్చున్నప్పుడు సరిగ్గా ఇలాగే అడిగేడు.

"రాధా! నన్ను చూడకుండా వుండగలవా" అని.

అప్పుడు తను అతని జుత్తులోకి చేతివేళ్ళని పోనిచ్చి, ప్రేమగా దగ్గరకు లాక్కుని చెప్పింది.

"లేదు చిట్టీ, రోజూ ఒక్కసారైనా నువ్వు కనబడకపోతే నాకు చచ్చిపోవాలనిపిస్తుంది" అంది తను.

అలాంటిది ఇప్పుడేమని సమాధానం చెప్పాలి ?

తెగింపు తెచ్చుకొని అతని మనసు విరిగిపోయేలా మాట్లాడాలి. అతనికి తనంటే అసహ్యం కలిగేలా ప్రవర్తించాలి. అప్పుడుగానీ తనని మర్చిపోయి, అతనో మనిషిగా మారడు.

కూడదీసుకొన్న మాటలతో అంది రాధ. "నేను గుమాస్తా భార్యనని హేళన చెయ్యడాని కొచ్చేవుకదూ?" అని.

"నేనలా అనుకోలేదు. గోపాల్రావు చాలా యోగ్యుడు."

"కొంప్లిమెంటుకి సంతోషం."

"ప్లీజ్. నువ్వలా నిష్ఠూరంచేసి మాట్లాడకు. నాపైన నీకున్న దురభిప్రాయం నీకింకా పోలేదు. నాలుగేళ్ళ తర్వాత కలుసుకొన్నా అదే దురహంకారంతో మాట్లాడుతున్నావ్. అల్‌రైట్. నే వెళతాను. కానీ వెళ్ళేముందు ఓ మాట."

"ఏమిటీ?"

"ఎక్కడున్నా, ఏం చేస్తున్నా, ఎప్పుడూ నిన్ను నా గుండెల్లో నింపుకొని ఇలాగే ఆరాధనలో గడిపేస్తాను."

"........."

"ఒక్క చిరునవ్వు నవ్వు. నాకదే చాలు. ఆనందంగా వెళ్ళిపోతాను" అడిగేడు.

"అవన్నీ ఎప్పుడో మర్చిపోయాను. ఇక వెళ్ళొచ్చు" అంది.

చిట్టిబాబు ఒక్కసారి రాధమొహం చూసి మరేం మాట్లాడకుండా బయటికి నడిచేడు.

అతని వెనకే పరిగెత్తికెళ్ళి, చెయ్యి పట్టుకొని ఆపాలనిపించింది. తన హృదయభారం తీరేవరకూ అతనివడిలో పడుకొని ఏడవాలనిపించింది.

కన్నీళ్ళమధ్య అతను వెళ్ళిపోతూ కనబడేసరికి. 'చిట్టిబాబూ! నేను పాపిష్టిదాన్ని. నిన్నింతసేపు విసుగుకలిగే మాటల్తో విసిగించి బాధపెట్టాను. నిజం నువ్వులేకుండా నేను బ్రతకలేను. చిట్టీ. నువ్వు నాక్కావాలి. మనస్పూర్తిగా ప్రేమిస్తున్నాను. కానీ నిస్సహాయురాల్ని. ఆడపిల్లని. ధైర్యంగా ఆమాటలు నీతో చెప్పుకోలేని పిరికిదాన్ని' అని భోరుమని ఏడవాలనిపించింది.

పూర్వం అతనెలా వుండేవాడు. ఎలాంటివాడు ఎలా అయిపోయాడు. తన మూర్ఖత్వంవల్లనే చిట్టిబాబు ఇలా పతనం అయిపోతున్నాడు.

'భగవాన్. నేను నిన్నెప్పుడూ ఏమీ కోరలేదు. ఇప్పుడు నాకుంది ఒకటే కోరిక. చిట్టిబాబు సుఖంగా వుండాలి.అతన్నిక్షేమంగాకాపాడుతండ్రీ. ఇంతకిమించి జీవితంలోమరే పెద్ద కోరికా కోరను.' దిగులుగా, పగిలిపోతున్న హృదయంతో రోడ్డు పైకి చూసింది.

హెరాల్డుకారు రోడ్డుపైన దిగులుగా జారిపోతూ కనబడింది. ఏడుపొచ్చింది.

లోపలికి పరుగెత్తుకెళ్ళి మంచంపైన వాలిపోయింది రాధ దిండులో మొహం దాచుకొని, వెక్కివెక్కి ఏడ్చింది.



# విద్య

సి. ఆనందారామం

(గత సంచిక తరువాయి)

## 14

చేస్తున్న నాట్యం మధ్యలో ఆపేసింది విద్య. అందరికళ్ళూ విద్యను ఆశ్చర్యంగా చూసాయి. విద్యకళ్ళు మాత్రం అప్పుడే హోటల్‌కివచ్చి ఒక టేబిల్ దగ్గిర నిలుచున్న మనోహర్‌నే చూస్తున్నాయి. శంకరరావు కనుబొమ్మలు ముడిపడ్డాయి—విద్యనూ, మనోహర్‌నూ చూసాడు. "విద్యా!" అన్నాడు మందలింపుగా...

విద్య వినలేదు!

ఒక్క మనోహర్‌తప్ప ఆమె మనసుకు మరేదీ తెలియటంలేదు.

ఏదోశక్తి తనను నడిపిస్తున్నట్లు... తానేంచేస్తోందో తనకే తెలియనట్లు... ఒకొక్క అడుగే ముందుకువేస్తూ మనోహర్‌ను సమీపించింది—తనచెయ్యి జాపాడు మనోహర్! ఒక్క క్షణమయినా సంకోచించక ఆ చేతిలో తన చెయ్యివేసింది విద్య. ఆ చేతిని గట్టిగా పట్టుకున్నాడు మనోహర్.

"విద్యా! నాతో వస్తావా?"

"'మీరెప్పుడువస్తారా' అని ఎదురు చూస్తున్నాను. పదండి..."

విద్య తానే ముందుగా దారితీసింది.

విద్యా, మనోహర్‌లు ఒకరిచెయ్యి మరొకరు పట్టుకుని కదిలిపోతోంటే వాళ్ళంతా కొరంలాసినట్లు చిత్రెత్తింది శంకరరావుకు.

"విద్యా! ఎక్కడికి?"

అన్నాడు—అనటంకాదు! గర్జించాడు!